పాత పట్నానికి కొత్తశోభ కలేనా!

- రెండేళ్లుగా పూర్తికాని షాపింగ్ కాంప్లెక్
- ఊసేలేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- అసంపూర్తి నిర్మాణంతో కళతప్పిన బస్తీ
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పాత పట్నానికి కొత్తశోభ తీసుకురావాలని గత సర్కారు సంకల్పించింది. అందులో భాగంగా బస్టాండు సమీపంలోని పురాతన గిడ్డంగులను తొలగించి.. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే దుకాణ సముదాయం నిర్మాణం, అందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఆగమేఘాల మీద రెండేళ్ల క్రితం పనులు సైతం ప్రారంభించింది. ఏమైందో ఏమో కానీ.. పనులు అర్ధాంతరంగా నిలిచి.. అసంపూర్తి నిర్మాణంతో దర్శనమిస్తోంది.

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ ఆఫీసుకు శాశ్వత భవనం నిర్మిస్తే బాగుంటుందని నాటి ఎమ్మెల్యే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావించారు. అదీ పాత ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ సమీపాన నిర్మిస్తే.. పరిసర ప్రాంతాలు, బస్తీలు అభివృద్ధి చెందుతాయని ఆశించారు. అందులో భాగంగా ఆ ప్రాంతంలోని పురాతన గోదాంలను నేలమట్టం చేశారు. అక్కడే మున్సిపాలిటీ దుకాణ సముదాయం నిర్మించి, అందులో రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అనంతరం 2022 ఫిబ్రవరిలో పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అందుకు రూ.1.50 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

గ్రౌండ్ లెవల్‌తో స్టాప్

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ బాధ్యతలు దక్కించుకన్న సదరు కాంట్రాక్టర్ మంజూరైన రూ.18 లక్షలతో పనులు ప్రారంభించారు. గ్రౌండ్ లెవల్ స్లాబ్ వరకు నిర్మాణం చేశారు. అనంతరం ఆయన చేతులెత్తేశారు. పనులు నిలిచి రెండేళ్లు గడిచినా.. భవన నిర్మాణం గురించి మున్సిపాలిటీ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న భవన పరిసరాల చుట్టూ చెత్తచెదారం, ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఇదే విషయమై ప్రాంత ప్రజలు కొందరు.. పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.





అసంపూర్తి నిర్మాణంతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (ఇన్‌సెట్లో) శిలాఫలకం

ఎమ్మెల్యే చొరవ చూపాలి

దుకాణ సముదాయ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని టీయూఎఫ్ఐడీసీ(రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా.. నిధులు మంజూరు కానట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకుని.. కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం తగదు



పాత బస్తీని నిర్లక్ష్యం చేస్తున్నారు. అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో బస్తీ కళ తప్పింది. షాపింగ్స్ కాంప్లెక్స్ నిర్మాణం.. రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించారు. కానీ మధ్యలోనే పనులు ఆపేశారు. వెంటనే కాంప్లెక్ పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలి. పాతపట్నం అభివృద్ధికి పాటుపడాలి.

- గొగికార్ జగదీశ్, వ్యాపారి, పాత బస్టాండ్

అపరిశుభ్రంగా..



కాంప్లెక్ అసంపూర్తి నిర్మాణంతో పరిసర ప్రాంతాలు చెత్తచెదారం, పిచ్చిమొక్కలతో కంపు కొడుతున్నాయి. దుకాణ సముదాయంతో బస్తీకి కళ వస్తుందని ఆశించాం. భవన నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు భవనాన్ని పూర్తిచేయించి, రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించాలి.

-అశోక్, అంబేద్కర్‌నగర్, పాత పట్నం

నిధులొస్తే పనులు షురూ



నిధులు మంజూరు కాగానే అసంపూర్తి దుకాణ సముదాయ భవన నిర్మాణ పనులు చేపడతాం. డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) కింద మంజూరైన రూ.18 లక్షలతో స్లాబ్ వరకు పనులు అయ్యాయి. మరో రూ.కోటి కోసం టీయూఎఫ్ఐడీసీకి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలుస్తాం.

-రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



టీచర్‌ను సత్కరిస్తున్న ఏబీసీ సభ్యులు

ఆమనగల్లు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పబ్బతి ఆంజనేయులును ఆమనగల్లు బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పబ్బతిని ఏబీసీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏబీసీ సభ్యులు దూసకంటి శ్రీదర్, డా.శ్రీనివాస్, కొట్ర మల్లేశ్, బికుమాండ్ల నర్సింహా, లక్ష్మీనారాయణ, మణిపాల్‌రెడ్డి, రాములయ్య, పాండు, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: కల్వకుర్తి డిపో నుంచి మండల పరిధి గట్టుఇప్పలపల్లి, మెదక్‌పల్లి, రాంపూర్, చంద్రధన గ్రామాల మీదుగా తలకొండపల్లి వరకు బస్ సౌకర్యం కల్పించాలని రాంపూర్ గ్రామ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం డిపో మేనేజర్ సుభాషిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తలకొండపల్లి మండల కేంద్రానికి బస్ సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే సర్వీసును తిప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణ, లక్ష్మయ్య, అశోక్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తామని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ మంగళ్‌పల్లి పటేల్‌గూడ 12వ వార్డులో రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులు ఆయన ప్రారంభించారు. దశల వారీగా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్ మౌనిక, ధన్‌రాజు, నారాయణ, శివం, బాషమ్మ, శ్రీశైలం, నరసింహా, సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించిన హెచ్‌ఎం అరుణ, మాస్టర్ సోను

కడ్తాల్: కరాటే ఆత్మరక్షణతో పాటు శరీర దారుఢ్యానికి కరాటే దోహదపడుతుందని, బాలికలు యుద్ధవిద్యపై ఆసక్తి చూపాలని మాస్టర్ సోను అన్నారు. విద్యాశాఖ జిల్లా అధికారి ఆదేశానుసారం సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణా తరగతులను హెచ్‌ఎం అరుణతో కలిసి మాస్టర్ ప్రారంభించారు. అనంతరం శిక్షకుడు మాట్లాడుతూ.. తమనుతాము రక్షించుకోవడంతో పాటు.. ఆపదలో ఉన్నవారిని కాపాడటానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు



ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న సంఘం నాయకులు

యాచారం: మండల పరిధి పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ నాయకులు సభ్యత్వ నమోదు చేశారు. సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జగన్మోహన్ గుప్తాలు.. గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదోన్నతులు, బదిలీలు చేపట్టిన సర్కార్, ఇప్పటి వరకు జూలై నెల వేతనాలు అందించకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్ డీఏలను ఇవ్వాలని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం యాచారం మండల శాఖ ప్రధాన కార్యదర్శి యాదగిరి, గౌరవ అధ్యక్షుడు బోజయ్య, జిల్లా బాధ్యులు తిరుమలేశ్, శ్రావణ్, మహేశ్, హరిప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దప్పు కళాకారుడికి అఖండ నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాకారుడు

యాచారం: డప్పు కళాకారుడైన దళిత యువకుడికి నేషనల్ అఖండ నంది అవార్డు దక్కింది. మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర అంబేడ్కర్‌ది నిరుపేద కుటుంబం. చిన్ననాటి నుంచే డప్పు కళపై పట్టుసాధించాడు. కళానైపుణ్యం గల వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం.. తెలంగాణ రాష్ట్ర కళా సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తాండ్ర.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నాడు. ఈ సందర్భంగా మోర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన.. హైదరాబాద్ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రముఖ నటులు రజిత, శ్రీనివాస్, వంశీ, ఆదివాసి సకల కళాకారుల డైరెక్టర్ శ్రీధర్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు తాండ్రకు శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

తలకొండపల్లి: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ అన్నారు. మండల పరిధి చంద్రధనలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో, ఆమనగల్లు లయన్స్ క్లబ్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 234 మందికి బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

- సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్



పీఆర్‌టీయూ టీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూ టీఎస్‌తోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శిగా చీమర్ల రాధాకృష్ణారెడ్డి, అసోసియెట్ అధ్యక్షుడిగా వెంకటేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా భాగ్యమ్మ, కార్యదర్శిగా రామ్మోహన్‌లను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా గోవర్దన్, సామల మాట్లాడుతూ.. త్వరలో ఏకీకృత సర్వీస్ సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓలుగా, జేఎల్, డైట్ లెక్చరర్లుగా ప్రమోషన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పత్రికా సంపాదక వర్గ సభ్యులు జగన్మోహన్ గుప్తా, కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, మల్లీశ్వరి, ఉమాదేవి తదితరులు ఉన్నారు.

ఒర్రెలు పారి.. రోడ్డు కొట్టుకుపోయి..



బండలేమూర్-పోర్లగడ్డతండా రోడ్డు దుస్థితి

మంచాల: ఏకధాటి వర్షాలతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఒర్రెలు పారి.. మట్టిరోడ్లు కొట్టుకుపోయాయి. మండల పరిధి బండలేమూర్-పోర్లగడ్డతండా రోడ్డు పూర్తిగా దెబ్బతినగా.. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వ్యక్తిగత వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరగలేని దుస్థితి ఏర్పడింది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెరువుకు తాత్కాలిక మరమ్మతులు

కడ్తాల్: మండల పరిధి చల్లంపల్లి గ్రామంలో గండి పడిన సామాసి కుంట చెరువుకు ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. గండి పడిన చోట జేసీబీ సహాయంతో మట్టి పోసి గండిని పూడ్చారు. పనులను ఇరిగేషన్ ఏఈ నిఖిల పర్యవేక్షించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి
- గణపతి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



సురసముద్రం చెరువును పరిశీలిస్తున్న ఏసీపీ

ఆమనగల్లు: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ ఎస్.సీ.హెచ్. రంగస్వామి అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా.. గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సోమవారం ఆయన ఆమనగల్లు పట్టణంలోని వినాయకులను నిమజ్జనం చేసే సురసముద్రం చెరువును, నిమజ్జన ఏర్పాట్లను స్థానిక అధికారులు, మునిసిపల్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. వినాయక మండలపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. నిమజ్జనం సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించాలన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ వసంత, మైనర్ ఇరిగేషన్ ఏఈ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో.. పూజలందుకుంటున్న గణపతి



ఇబ్రహీంపట్నంలో..



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మాడ్గుల: కోల్కులపల్లి గ్రామంలో..

వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని లంబోదరుడికి భక్తులు ఘనంగా పూజలు చేస్తున్నారు. మూడో రోజైన సోమవారం మండపాల్లో కొలువైన ఉండ్రాలయ్యకు భక్తజనం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. -సాక్షి, నెట్‌వర్క్

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్



సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరిస్తున్న గిరిజన నాయకులు

- హక్కుల సాధనకు సమష్టిగా కృషి
- సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్

కడ్తాల్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సేవాలాల్ మహారాజ్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతినాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ పిలుపునిచ్చారు. అందుకు ఆయన చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. సేన 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని గిరిజనభవన్ ఆవరణలో సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. గిరిజన హక్కులను సాధించేందుకు ప్రతి ఒక్కరూ సంఘటితం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. 12 శాతం రిజర్వేషన్లతో పాటు.. సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీలను రెవెన్యూ జీపీలుగా గుర్తించాలని పేర్కొన్నారు. తండాల్లో పల్లె దవాఖానలు ఏర్పాటు చేయాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రఘురాం రాథోడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పత్యానాయక్, నాయకులు నరేశ్‌నాయక్, భీంలాల్, బీక్యానాయక్, తులసీరాం, భూనాథ్, రాము, శంకర్‌నాయక్, పాండునాయక్, సేవ్యానాయక్, శ్రీను, బలరాంనాయక్, గోపి, హరియా, వినోద్, బీమా, రాజు, భిక్కు, బాబులాల్, అఖిల్, గోపాల్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హాస్టల్‌లో వైద్య శిబిరం

తలకొండపలి: మండల పరిధి వెల్జాల్ బీసీ హాస్టల్‌లో సోమవారం వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైదమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫీవర్, జలుబు, దగ్గు తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఇందులో హెచ్‌ఈఓ ఆంజనేయులు, హెచ్ఏ మల్లయ్య, ఎఎన్ఎంలు సుజాత, సువర్ణ, వార్డెన్ శ్రీలక్ష్మీ ఉన్నారు.

కోదండరెడ్డిని కలిసిన నేతలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డిని కాంగ్రెస్ నేతలు పలువురు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా నాయకుడు శేఖర్‌గౌడ్, కిసాన్‌సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కృష్ణ, అలీబాయ్ ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు

మంచాల: నూతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రసన్నకుమార్ శర్మ సోమవారం కలిశారు. అనంతరం అయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

తలకొండపల్లి: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారిని తీర్చి దిద్దాలని ఎంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు, వారికి వడ్డిస్తున్న భోజనం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్య రక్షణ కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏ రోజు పాఠాలను ఆ రోజే చదువు కోవాలని, అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు ఇవ్వాలి

మాడ్గుల: కేంద్రం 16వ ఆర్థిక సంఘం నిధులు జనాభా ప్రాతిపదికన ఇవ్వాలని మాజీ ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి అన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ సమక్షంలో ఆర్థిక సంఘం నిధులపై హైదరాబాద్ ప్రజాభవన్లో కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు అభిప్రాయ సేకరణలో మాట్లాడారు. మండల పరిషత్‌కు స్పెషల్ గ్రాండ్ 10శాతం నుంచి 30శాతానికి పెంచాలని కోరారు. ఎలక్ట్రిసిటీ, శానిటరీ మెయింటనెన్స్‌కు, నూతన జీపీల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు నిధులు కేటాయించాలన్నారు.

తెలంగాణ యాస జీవన భాష

- మిగతా భాషల పదాలనూ తనలో కలుపుకొని ప్రవహించే జీవనది
- ప్రొఫెసర్ భుజంగరెడ్డి
- ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ యాస.. జీవన భాష అని, ఇతర భాషల పదాలను సైతం తనలో కలుపుకొని జీవనదిలా ప్రవహించేది అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాణాల భుజంగరెడ్డి అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భుజంరెడ్డి మాట్లాడుతూ.. కాళోజీ జీవితమంతా తెలంగాణ ప్రజాజీవనం, భాషా సంస్కృతుల పరిరక్షణ ఉద్యమాల కోసమే సాగిందని పేర్కొన్నారు. తనదైన సాహిత్యంతో తేలికైన మాటలతో గొప్ప నిగూఢమైన అర్థాన్ని పలికించి, ప్రజాకవిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు ఊపిరిలూదిన మహనీయుడు అని కీర్తించారు. గ్రంథాలయాల ఉద్యమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ చరిత్ర అంతటా ఆయన జీవన ప్రయాణం కొసాగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, తెలుగు విభాగం అధ్యక్షుడు డా.సురేశ్, అధ్యాపకులు డా.రాకేశ్ భవాని, కృష్ణ, శంకర్, డీపీ రావు, నరేందర్‌రెడ్డి, నీలిమ, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీకి నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

పుట్టుక నీది, చావు నీది

కాళోజీ జయంతి సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడుతూ.. పుట్టుక నీది. చావు నీది. బతుకంతా దేశానిది అని కాళోజీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జమీర్, మల్లేశ్, విష్ణు, ఆనంద్, మహేశ్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో..

కడ్తాల్: ప్రజాకవి, అక్షరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్ఓ అనిత, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం.. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పాత్ర, తెలంగాణ యాసకు వన్నె తెచ్చిన విధానం గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి చేసిన సేవలు మరువలేనివని, ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనికుడు నారాయణరావు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుట్లలో.. పుస్తక ప్రదర్శన

మంచాల: ప్రజా కవి కాళోజీ జయంతి సందర్భంగా మండల పరిధి ఆరుట్ల మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయురాలు ఉషారాణి ఆధ్వర్యంలో తెలుగు రచయితల పుస్తకాలు, పాటలు, వారి చిత్రాలను ప్రదర్శించారు. ముఖ్యంగా కాళోజీ 'నా గొడవ, నా భారత దేశ యాత్ర' వంటి రచనలు, తెలుగు భాషకు ఆయన చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యాయులు మోహన్ గౌడ్, శ్రీకాంత్, రమేష్, శ్రీలత, శివకుమార్, పారిజాత, బాబు, యాదగిరి, స్వప్న, రమలత పాల్గొన్నారు.



పుస్తక, చిత్ర పటాల ప్రదర్శనను చూస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు